# పేదతనం

శ్రీ యం. వి. సుబ్బారావు.



ఆది నడివేసవికాలంలోని మిట్టమధ్యాన్నం. సూర్యుడు ప్రతి వస్తువు నెత్తిపై సూటిగా నిలచి పాపల ఉత్పత్తిని త్రుంచివేసినవాడయ్యాడు. సూర్యుడు తన ప్రచండ కిరణములనే వేడిమేఘములచేత ఎండను నిప్పులవానగా దేశమంతటా కురిపిస్తూ సకలలోకానికి భీతిగొల్పుతున్నాడు. ఎడారిలో ఇసుకతెరలను పరిసరములను అల్లకల్లోలముచేయు గాలిభూతం, తన మానవపరిసర సంచారములో చెట్లను మొదటికంట ఊపుతూ, దుమ్మును విపరీతంగా లేపుతూ. దారిలోని మానవుల్ని బాధిస్తూ విసిగిస్తూంది. అగ్నికిగాలితోడై దేశాన్నంతా తగులబెట్టగలిగినట్లు, ఎండకు గాలితోడై వేడిగాడ్పులు జనింపజేసి దేశమంతటా ఆక్రమించి వీలైనన్ని విధాల నొచ్చుకునేటట్లుగా ప్రతిప్రాణిని హింసిస్తున్నయి.

ఆ ప్రళయకాల లక్షణాలు విజృంభించి లోకమంతటా తాండవిస్తున్న సమయాన దీనుడై ఏకాకియై, అగ్నిగోళమును పోలియున్న భూమిపై కాలిడి, నిప్పుపైకాలిడి బాధపొందినట్లు బాధపొందుతూ, చెట్లూ పొదలులేని ఒక అయోమయపు దొంకను పడివస్తున్నాడు ఒక పేదనిర్భాగ్యపు ముసలివైద్యుడు. అతని కానాటి ప్రొద్దుటినుండీ తినుట కాహారంలేదు. అతనికి ఆధారభూతులైన వారెవ్వరూ లేనందుకు పలువిధాల చింతించి, దుఃఖించి, తాను మందిచ్చి వైద్యం చేస్తున్న చోట్ల డబ్బుతెచ్చుటకు మిక్కిలిశ్రమపడి చుట్టుపట్ల గ్రామాలన్నీ తిరిగి విఫలుడై అలసి కాగిపోయిన శరీరాన్ని యీడ్చుకుంటూ, గ్రామంలో పడి తర్వాత పనులు చూచుకోవచ్చునని చెదరిపోయిన మనస్సుతో లేని ఓపికను తెచ్చుకొని నడిచివస్తున్నాడతడు. అతని ఆకలిమంటచే రగుల్కొని లోనమండుతున్న అగ్ని, బయటి తీక్షణపు ఎండాగాలుల సహాయాన మిన్నంటి శరీరాన్ని దహించటానికి సిద్ధంగావుంది. ఆ మానవుని వేరే ఏమీ ఆలోచించనీయకుండా బయటిలోపలి పరిస్థితులు యిట్లా స్వాధీనం చేసుకున్నయి. మిగిలి, అతడు చేయుటకు బలవంత పెట్టబడిన పని ఒకటియే—అది తన యింట్లో, నీడలో కూలబడటం.

ప్రతినిమిషానికీ అతని శరీరం వేడెక్కి ఆవిర్లు తేలిపోతూవుంది. సూర్యునినుండి నిలువున వచ్చు కిరణములు అతని తలను కాల్చినంతగా లేకున్నా ఎక్కువగాబాధ పెడుతున్నయి. అతనికి చిన్ననాటి విషయాలు జ్ఞాపకానికివచ్చి హృదయము పట్టలేనంతగా లోలోన దుఃఖించాడు. అతడు వయస్సులో ఉన్నపుడు పగలల్లా ఇంతకంటే ఎక్కువ గనే బాధపడి ఒక జంతువుగా పనిచేశాడు. మానవుని చేతిలో మిషనా ఎట్లాగో యజమానుల చేతుల్లో తానట్లా వుండి, కష్టించి, తాను కష్టంచేస్తున్నందుకు ప్రతిఫలం పొందగలుగుతాననే సంతోష ధైర్యాలు లేకుండా, తన పొట్టకూటికి, ఆ పూటకు అన్నంలేక మలమల మాడవలసిన తనస్థితిని చూచుకొని. పరిస్థితులచే బలవంతపెట్టబడి, యజమానులకు ఎంతటి పనైనా, ఎంతసేపైనా చేయవలసి వచ్చింది. ఆ నాటి దినాలు జ్ఞప్తి తెచ్చుకొని, అప్పుడు చేసిన పనికి తగిన ప్రతిఫలం పొందగలిగి ఉన్నట్లయితే, యీ ముసలితనాన హాయిగా యింట్లో కూర్చొని చేయజాలని పనులు చేయుటకు సిద్ధంగా వుండ నవసరములేదు, గదాఅని వేడి వేడి నిట్టూర్పులు విడిచాడు. ఆ దినాలకే సరిపోను తిండి లేక పోయినప్పుడు ఎంత జాగ్రత్తగా వున్ననూ, ఎంత తెలివితేటలు గలవాడైననూ యీ ముసలితనాన తన్ను రక్షించుకుంటానికి ఎట్లా సదుపాయాలు చూచుకోగలుగుతాడు?

తన్ను సంఘం చూస్తున్న చందం జ్ఞప్తికి తెచ్చుకొని పేదవాళ్ళను సంఘం ఎంత అన్యాయంగా, అసహ్యంగా చూస్తున్నదీ ఊహించి ,సంఘం వట్టి తెలివి తక్కువది, దానికి సరైన విచక్షణా విచక్షణ జ్ఞానం లేదు, ధనవంతుల్ని భూషించడం, లేని గుణాలు ఉన్నయ్యని పొగడటం, ఇంద్రులు చంద్రులని పొగడి వారి ఆదరణ పొందటానికి ప్రయత్నించటం; పేదవాళ్ళని దూషించటం. వాళ్ళే పనులుచేసినా చెడు పనులని భావించటం మొదలగు విషయాలు కన్నులకు కట్టినట్లుగా తెలిసికోగల్గాడు. ఒకే మానవుని ,అతడు ధనవంతుడై యున్నప్పుడు పొగడిన సంఘం, పేదవాడైనప్పుడు పొగడదు, గౌరవించదు. సంఘం ఒక మానవుని స్తుతని ధనవృత్తుల ద్వారా వీక్షిస్తుంది. ఒక పేదమానవుని తెలివితేటలు సంఘంలో తగినంతగా ప్రశంసింపబడవు. ప్రస్తుతమున్న సంఘంయొక్క పిచ్చి పిచ్చి ఊహలు, విపరీతమైన చెడ్డ విచక్షణలు తలచుకొని పేదమానవులు యిల్లావారు బ్రతికినంతకాలం అన్యాయమై పోవటమేనా అని దుఃఖించాడు, వీరికి మోక్షం ఎప్పుడు, వీరు సంఘంలో సమానంగా ఎప్పుడు చూడబడతారు? అను ప్రశ్నలు అతని మనస్సులో జనించి, మనస్సుయొక్క నాలుగు గోడలనీ తాకి అతన్ని ఆలోచనా సముద్రాన ముంచివేసినయి. ధనవంతులూ పేదవాళ్ళూ అని వేరువేరు తెగలున్నంతకాలం మానవులందరూ సంఘంలో సమానంగా చూడబడరని తెలుసుకున్నాడు, అందరూ సమానంగా, సౌఖ్యంగా, శాంతంగా వుండి ఒకటిగా తమ పనులన్నీ నిర్వహించుకుంటూవుంటే చెప్పబడే అనుమానించబడే స్వర్గంలోని సౌఖ్యాలు నిజంగా యీ లోకంలోనే పొందగలిగినవారౌతారు.

ఈ విషయాలన్నీ తన చిన్ననాడు, బహు కష్టపడి తండ్రి చెప్పించిన విద్యవలన, తర్వాత అనేక సారులు తర్కించి ఆలోచించుకొనుటవలన యీ